మాట్లాడుతున్న ఓబీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు

చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 1: చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఓబీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట సభల్లో అసెంబ్లీ, పార్లమెంట్‌లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుచేయాలన్నారు. బీసీ కుల గణనను ఆమోదించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, అందుకు సహకరించిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఉద్యమం నడిపి పోరాడిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విహాన్‌రెడ్డికి గోల్డ్‌మెడల్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తైక్వాండోలో గోల్డ్‌మెడల్

నారాయణఖేడ్, మే 1: అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో నారాయణఖేడ్‌కు చెందిన బాలుడు విహాన్‌రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించాడు. మలేషియాలో ఆ దేశ ప్రభుత్వం నిర్వహించిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్‌లో పాల్గొన్న పట్లోళ్ల విహాన్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని దక్కించుకున్నాడు. ఈ అరుదైన ఘనతను సాధించిన విహాన్ రెడ్డిని ప్రధాన కోచ్ ప్రదీప్, కోచ్‌లు శరత్, పునీత్ అభినందించగా, విహాన్‌రెడ్డి తల్లిదండ్రులు విష్ణువర్ధన్‌రెడ్డి, రజినీలు ఆనందం వ్యక్తం చేశారు.

ఫ్లైఓవర్ పై నుంచి దూకి

వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం, మే 1: బీహెచ్ఈఎల్‌లో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ పై నుంచి ఓ వ్యక్తి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గోపరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన చంద్రప్ప(35) కొన్నేండ్ల క్రితం బతుకుదెరువు కోసం తెల్లాపూర్‌కి వచ్చారు. ప్రస్తుతం చేవెళ్లలో నివాసం ఉంటున్నాడు. అడ్డా మీద కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, పెండ్లి కాకపోవడంతో ఒంటరితనాన్ని తట్టుకోలేక మనస్తాపంతో గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఫ్లైఓవర్ పైకెళ్లి అక్కడి నుంచి కిందకు దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దూకుతున్న సమయంలో కింది నుంచి ఆటో డ్రైవర్లు వద్దని అరిచినప్పటికీ వినకుండా కిందకు దూకాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతి చెందిన చంద్రప్ప గతంలో తెల్లాపూర్‌లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది. మృతుడి తల్లి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కందిలోని పశు వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశు సవంర్ధక శాఖ అధికారి వసంతకుమారి

జీవాలకు టీకాలు వేయించాలి

కంది, మే 1: మూగ జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి సూచించారు. గురువారం కంది పశు వైద్యశాలను ఆమె తనిఖీ చేశారు. మూగజీవాలకు అందుతున్న చికిత్సలు, మందులు తదితర రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ పశువులకు మెరుగైన వైద్యసేవలందించాలని మండల పశు వైద్యాధికారిని ఆదేశించారు. పశువులు, గొర్రెలు, మేకలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

అధికారులపై విచారణ చేపట్టాలి

చేర్యాల, మే 1: పట్టణంలో గృహ నిర్మాణదారుల వద్ద లంచాలు తీసుకుంటున్న మున్సిపల్ అధికారుపై విచారణ చేపట్టాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ అందెబీరన్న గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కమిషనర్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సహాయంతో చేర్యాలలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనుమతి లేకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని చెప్పినా అసలు పట్టించుకోవడం లేదన్నారు.

కోహీర్: కవేలి సెయింట్ గోబైన్ పరిశ్రమ వద్ద జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు

జహీరాబాద్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

జహీరాబాద్‌లోని శ్రామిక్ భవన్ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు మల్లేశం

పటాన్‌చెరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఘనంగా మేడే వేడుకలు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయూ, బీఆర్ఎస్వీ నాయకులు, వివిధ కార్మగారాలకు చెందిన కార్మికులతో కలిసి బైక్ ర్యాలీలు, జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మేడే స్ఫూర్తితో ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

- సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, మే 1

అందోల్: మేడే సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

ఆర్సీపురంలోని ప్యారగాన్ కంపెనీ ఎదుట బీఆర్ఎస్‌కేవీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

ఆర్సీపురం: భెల్‌లో చిన్నారులకు బహుమతులు అందజేసిన అధికారులు, యూనియన్ నాయకులు

నారాయణఖేడ్: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

గుమ్మడిదలలో బీఆర్ఎస్‌కేవీ జెండాను ఎగురవేసిన బీఆర్ఎస్, కార్మిక సంఘాల నాయకులు

కొండాపూర్: గంగారంలో కార్మిక జెండాను ఎగుర వేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా దవాఖానలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్: మే డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఫోరం ఫర్ బెట్టర్ సంగారెడ్డి ప్రతినిధులు

ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు

విజేతలను సన్మానించి కలెక్టర్ వల్లూరు క్రాంతి

విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్/మునిపల్లి, మే 1: రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శాలువాలతో సన్మానించారు. పదో తరగతి ఫలితాల్లో భాగంగా 600 మార్కులకు కంకోల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినీ వర్షిత 590 మార్కులు సాధించగా, చెరియాల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినీ గాయత్రీ 588 మార్కులు, అందోల్ టీఎంఆర్ఎస్ విద్యార్థినీ రిషిత 586 మార్కులు, హెచ్ ద్రిషిక 586 మార్కులు సాధించారు. వీరందరినీ జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాలతో విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉంటుందన్నారు. విద్యతోపాటు సంగారెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచాలన్నారు. ఈ సారి ఫలితాల్లో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం లభించిందని, వచ్చే ఏడాది మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆయా సబ్జెక్టుల్లో వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీ శంకర్, డీసీబీ కార్యదర్శి లింబాజి, సీఎంవో వెంకటేశం, ఏఎంవో బాలయ్య, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి, డీఎస్వో సిద్దారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో కశ్మీర్ ఉగ్రదాడిని నిరసిస్తూ, ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని గురువారం సాయంత్రం సంగారెడ్డిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐబీ వద్ద శ్రద్ధాంజాలి ఘటించిన విశ్వబ్రాహ్మణులు.

– సంగారెడ్డి కలెక్టరేట్, మే 1

రోడ్డుపై పారుతున్న మురుగు

హత్నూర, మే 1: రోడ్డుపై నిత్యం మురుగు పారుతుండటంతో తారురోడ్డుపై గుంతలు పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. తారురోడ్డుపై మురుగు పారుతున్నా పట్టించుకునేవారు లేకపోడంతో తారుతేలిపోతుంది. హత్నూర మండలం సిరిపుర బస్టేజీ సమీపంలో గల ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి రోడ్డుపై మురుగు పారుతూ గుంతలు పడటంతో మరమ్మత్తులు చేయకపోవడంతో తారుతేలిపోతూ ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది.

సిరిపుర ప్రధాన రహదారిపై మురుగు

అంతేకాకుండా సమీప ఇండ్ల ప్రజలకు దుర్వాసన వస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తారురోడ్డుపై ఏర్పడిన గుంతలుపూడ్చి మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

కొల్కురి నర్సింహారెడ్డికి శ్రమశక్తి అవార్డు

పటాన్‌చెరు రూరల్, మే 1: సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొల్కురి నర్సింహారెడ్డికి ప్రభుత్వం శ్రమశక్తి అవార్డును అందజేసింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రభుత్వం నిర్వహించిన మేడే సంబురాల్లో పటాన్‌చెరుకు చెందిన కొల్కురి నర్సింహారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రమశక్తి అవార్డ్‌ను అందజేశారు. కార్మికరంగంలో రెండు దశాబ్దాలుగా అందజేసిన సేవలకు గుర్తింపుగా శ్రమశక్తి అవార్డు వచ్చిందని కొల్కురి నర్సింహారెడ్డి తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. మేడే సందర్భంగా అవార్డు రావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్మికుల హక్కుల కోసం మరింత బాధ్యతతో, అంకితభావంతో పనిచేస్తానని ఆయన హామీనిచ్చారు.

శ్రమశక్తి అవార్డు అందుకుంటున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి

రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి

జిన్నారం, మే 1: రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో గాయత్రీ దేవి అన్నారు. గురువారం జిన్నారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖాన రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై వైద్య సిబ్బందిని అడిగి ఆరా తీశారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...అధునాతనంగా నిర్మించిన నూతన భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రసూతి సౌకర్యాలను గ్రామాల్లో వివరిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గురువారం ఎల్దర్లి ఓపీ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. దవాఖాన పరిసరాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం దవాఖానలో 14 మందికి ప్రసూతి సౌకర్యాన్ని కల్పించినట్లు వైద్యురాలు కోమలి తారక్ డీఎంహెచ్‌వోకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాన్ని పరిశీలిసున్న డీఎంహెచ్‌వో గాయత్రీ దేవి

కోల్డ్ స్టోరేజీపై రైతులతో సమీక్ష

గుమ్మడిదలలో కోల్డ్‌స్టోరేజీపై రైతులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

గుమ్మడిదల, మే 1: మండలకేంద్రంలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుపై ఉద్యానవన శాఖ హెచ్‌వో రైతులలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం గుమ్మడిదల రైతు సంఘం భవనంలో పటాన్‌చెరు నియోజకవర్గం హెచ్‌వో అనుషారెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి శీతలగిడ్డంగిపై రైతులతో చర్చించారు. ఇందులోభాగంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో గతంలో ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజీ శిథిలావస్థకు చేరుకుందని, కోల్డ్ చైన్ యూనిట్ కోసం అదనంగా భూమి సేకరించాలని, ఈ పాత కోల్డ్ స్టోరేజీని తిరిగి పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకువచ్చే వరకు కానుకుంటలో ఉన్న బ్రహ్మ ఆగ్రో కోల్డ్ స్టోరేజీని వినియోగించుకోవాలని రైతులకు తెలిపారు. కోల్డ్ స్టోరేజీ వల్ల కలిగే ప్రజయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, బాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, మే 1:జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాల్‌కల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సిద్ధిలింగయ్యస్వామి అన్నారు. గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు అమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి అమ్మాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శాంత్‌కుమార్‌పాటిల్, గురుపుత్ర, బీర్‌గోండ, కార్యదర్శి బస్వారాజ్, రైతులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అరకొర వసతులతో ప్రారంభమైన బోరంచ జాతర

బోరంచ నల్ల పోచమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

మనూరు, మే 1: మండల పరిధిలోని మంజీరా ఒడ్డున ఉన్న బోరంచ నల్ల పోచమ్మ అమ్మవారి జాతర అరకొర వసతులతో ప్రారంభమైంది. ప్రతి ఏడాది అధికారులు ఆలయానికి రంగులు వేసి, ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించి, ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరించడంతోపాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేవారు. కానీ ఈ ఏడాది ఎలాంటి ఏర్పాట్లు లేకుండా జాతరను ప్రారభించారు. రంగుల కోసం భక్తుల వద్ద విరాళాలు సేకరించిన అధికారులు ఆలయానికి రంగులు వేయకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతర ఏడు వారాల పాటు జరగనుంది. ప్రతి ఏడాది అక్షయ తృతియ తర్వాత వచ్చే మొదటి గురువారం నుంచి జాతర ప్రారంభమవుతుంది. జాతర ఉన్నదని తెలిసినా అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని పలు గ్రామాల భక్తులు ఆరోపిస్తున్నారు. 45రోజులపాటు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ఆదుకోండి సారూ...

- ఈదురుగాలులు, వడగండ్ల వానతో నష్టపోయాం
- ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి

చీకూర్తిలో ఈదురుగాలులకు ఇండ్లపై రేకులు ఎగరిపోయి నిరాశ్రయులైన బాధితులు

జహీరాబాద్, మే 1: ఇటీవల ఈదురుగాలులు, వడగండ్ల వానతో ఇండ్లపై రేకుల ఎగిరిపోయి నష్టపోయిన తమను ఆదుకోవాలని అధికారులను న్యాల్‌కల్ మండలం చీకూర్తి గ్రామానికి చెందిన బాధితులు విజ్ఞప్తి చేశారు. గతనెల 29న మధ్యాహ్నం భారీ ఈదురుగాలులు, వడగండ్ల వానతో ఇండ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయి నిరాశ్రయులయ్యామన్నారు. తిండి గింజలు వానకు తడిసి ముద్దాయాయని, పిల్లాపాపలతో బయట ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమను ఆదుకోవాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. మండల అధికారులు సైతం గ్రామాన్ని సందర్శించి తమ పరిస్థితిని చూడలేకపోయారని, జిల్లా అధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

అమీన్‌పూర్ సర్వేనంబర్ 993లో అక్రమ కట్టడాలను కూల్చుతున్న అధికారులు

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

అమీన్‌పూర్, మే 1: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 993 ప్రభుత్వ స్థలాల్లో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గురువారం జేసీబీలతో కట్టడాలను కూల్చివేశారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీమాన్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఎక్కడైన అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలతోపాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే నెంబర్ 993 స్థలంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎక్కడ నిర్మాణాలైనా, ఎవరి నిర్మాణాలైన కూల్చివేతలు తప్పవన్నారు. ఈ సర్వేనంబర్‌లో ఎప్పటికప్పుడు కట్టడాలను నేలమట్టం చేస్తూనే ఉన్నామన్నారు. అయినప్పటికీ పునరావృత్తం అవుతూనే ఉన్నాయని, వారిపై ప్రత్యేక చర్యలకు పూనుకుంటామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి

ఘనంగా భూపాల్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

రామచంద్రాపురం, మే 1: ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లి భూపాల్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పటాన్‌చెరు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, అనిరుధ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, నర్సింహ, కునాల్, పరమేశ్, మైపాల్‌యాదవ్, అజీముద్దీన్, పెద్దరాజు, జంగయ్య, నవీన్‌రెడ్డి, కృష్ణ, పాపయ్యయాదవ్, చంద్రశేఖర్, దేవేంద్రాచారి, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, క్రాంతి, మహేశ్‌గౌడ్, దిలీప్‌సింగ్, జానీ తదితరులు భూపాల్‌రెడ్డితో కేక్‌ని కట్ చేయించి సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.